# తూ మేరా లవరూ.. పెట్టావే చెవిలో క్యాలీఫ్లవరూ



'ఇడియట్'లో 'చూపుల్తో గుచ్చి గుచ్చి చంపకే..' సాంగ్ ఎంత హిట్టో తెలిసిందే. దివంగత సంగీత దర్శకుడు చక్రి స్వరపరిచి, స్వయంగా ఆలపించిన ఆ పాట రాష్ట్రాన్ని ఓ ఊపు ఊపేసింది. మళ్లీ ఆ పాటను.. ఆ ఫ్లేవర్నూ గుర్తుచేస్తూ.. శ్రోతలకు ఓ మ్యూజికల్ ఫేవర్ చేశారు సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో. రవితేజ నటించిన 'మాస్ జాతర' సినిమా కోసం ఆయన ఈ పాటను స్వరపరిచారు. అంతేకాదు, కృత్రిమ మేధా(AI) ని ఉపయోగించి దివంగత సంగీత దర్శకుడు చక్రి స్వరాన్ని తిరిగి సృష్టించారు. 'తు మేరా లవర్ లవర్ లవర్.. తుజ్ కో దియా ఫ్లవరూ.. తు మేరా లవర్ లవర్ లవర్.. పెట్టావే చెవిలో క్యాలీఫ్లవరూ..' అంటూ సాగిన ఈ పాటను భాస్కరభట్ల రవికుమార్ రాయగా..'ఇడియట్'లోని ఐకానిక్ సాంగ్ 'చూపుల్తో గుచ్చి గుచ్చి చంపకే..' పాటకు నివాళిగా మేకర్స్ ఈ పాటను అందించారు. రవితేజ శైలి డాన్స్, శ్రీలీల అద్భుతమైన నృత్య ప్రదర్శనతో ఈ పాట సినిమాకే హైలైట్ కానుందని మేకర్స్ తెలిపారు. త్వరలోనే విడుదల కానున్న ఈ యాక్షన్ ఎంటర్టైనర్‌కు భాను బోగవరపు దర్శకుడు. ఈ చిత్రానికి కెమెరా: విధు అయ్యన్న, నిర్మాతలు: సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య, నిర్మాణం: సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చ్యూన్‌ఫోర్ సినిమాస్.

# అర్జున్ సర్కార్ హింసాత్మక సంహారం



అగ్రహీరో నాని అప్ కమింగ్ సినిమా 'హిట్: ది 3rd కేస్'. దర్శకుడు శైలేష్ కొలను 'హిట్' ఫ్రాంచైజీలో ఇది మూడో సినిమా. ప్రశాంతి తిపిర్నేని, నాని కలిసి నిర్మిస్తున్నారు. మే 1న ప్రపంచవ్యాప్తంగా సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ని వైజాగ్‌లో అభిమానుల సమక్షంలో మేకర్స్ విడుదల చేశారు. నాని ఇందులో అర్జున్ సర్కార్‌గా నటించారు. ఆ పాత్రను పరిచయం చేస్తూ ట్రైలర్ మొదలైంది. 'క్రిమినల్స్ ఉంటే భూమ్మీద 10 ఫీట్ సెల్‌లో వుండాలి. లేదా.. భూమిలో 6 ఫీట్ హోల్‌లో వుండాలి..' అంటూ అర్జున్ సర్కార్‌గా నాని చెప్పిన డైలాగ్ పాత్ర స్వభావాన్ని తెలియజేస్తున్నది. ఓ పాప కిడ్నాప్ కేసు బాధ్యతను అర్జున్ సర్కార్ తీసుకోవడం.. నేరస్థుల ప్రపంచంలోకి వెళ్లి కనికరం లేకుండా వేటాడటం.. న్యాయం కోసం వాళ్లను అత్యంత హింసాత్మకంగా చంపటం ఈ ట్రైలర్‌లో చూడొచ్చు. ఉద్రేకపూరితమైన పాత్రలో అద్భుతంగా నానీని ప్రజెంట్ చేశారు దర్శకుడు శైలేష్ కొలను. మే 1న రాబోతున్న ఈ క్రైమ్ ఎమోషనల్ థ్రిల్లర్ ఆడియన్స్‌ని తప్పకుండా ఆకట్టుకుంటుందని నాని నమ్మకం వ్యక్తం చేశారు. శ్రీనిధి శెట్టి కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సాను జాన్ వర్గీస్, సంగీతం: మిక్కీ జె.మేయర్.

# వెంకటేశ్‌తో త్రివిక్రమ్ సినిమా?





వెంకటేశ్– త్రివిక్రమ్.. ఈ కాంబినేషన్ సినిమా కోసం ఆశించని ప్రేక్షకుడు లేడు. వెంకటేశ్ నటించిన నువ్వు నాకు నచ్చావ్, మల్లీశ్వరి చిత్రాలకు త్రివిక్రమ్ మాటలు రాశారు. దర్శకుడయ్యాక ఆయన వెంకీతో సినిమా చేస్తారని అందరూ భావించారు. కానీ ఎందుకో ఆ కాంబినేషన్ సెట్ కాలేదు. అయితే.. ఎట్టకేలకు వెంకీ, త్రివిక్రమ్‌ల కాంబినేషన్ సెట్ అయ్యిందని విశ్వసనీయ సమాచారం. వాస్తవానికి బన్నీ హీరోగా త్రివిక్రమ్ ఓ సినిమా చేయాలి. అయితే.. అట్లీ ప్రాజెక్ట్‌ని ముందు ఓకే చేశారు బన్నీ. ఆ ప్రాజెక్ట్ పూర్తయ్యే సరికి దాదాపు ఏడాదిన్నర పట్టడం ఖాయం. ఈ లోపు బన్నీ స్క్రిప్ట్ పూర్తి చేస్తూ, మరోవైపు వెంకీతో సినిమా కానిచ్చేయాలని త్రివిక్రమ్ నిర్ణయించారట. వెంకటేశ్‌కి సరిగ్గా సరిపోయే ఫ్యామిలీ డ్రామా సబ్జెక్ట్ త్రివిక్రమ్ దగ్గర సిద్ధంగా ఉందట. త్వరలో షూటింగ్ మొదలుపెట్టి, త్వరగా పూర్తి చేయాలనే సంకల్పంతో త్రివిక్రమ్ ఉన్నారట. ఆ వెంటనే బన్నీ సినిమా మొదలుపెడతారన్నమాట.

# అవి చిన్న సినిమాలా? పెద్ద సినిమాలా?



ఓవైపు సినిమాలు, మరోవైపు సిరీస్‌తో బిజీగా ఉన్నారు అందాలభామ తమన్నా. రీసెంట్‌గా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న తమన్నాకు.. 'ఆఫర్లు లేకపోవడంతో చిన్న సినిమాల్లో నటిస్తున్నారా?' అనే ప్రశ్న ఎదురైంది. తమన్నా మాట్లాడుతూ 'నా దృష్టిలో చిన్న సినిమా పెద్ద సినిమా అనేది ఉండదు. ఓ తక్కువ బడ్జెట్ సినిమా కంటెంట్ బావుండి హిట్ అయితే.. అదే పెద్ద సినిమా. ఓ భారీ బడ్జెట్ సినిమా కంటెంట్ బాగుండక ఫ్లాప్ అయితే.. అది ఆటోమేటిగ్గా చిన్న సినిమా అయిపోతుంది. కెరీర్ తొలినాళ్లలో 'హ్యాపీడేస్' చేశా. అందులో ఎనిమిదిమంది ప్రధానపాత్రధారుల్లో నేనూ ఒకదాన్ని. ఆ సినిమా మీ దృష్టిలో చిన్న సినిమానా? పెద్ద సినిమానా? ఆ సినిమా బడ్జెంట్ ఎంత? రాబట్టింది ఎంత? రీసెంట్‌గా 'స్త్రీ 2'లో ప్రత్యేక గీతంలో నర్తించా. నాకు డాన్స్ అంటే ఇష్టం కాబట్టే చేశా. నిజానికి ఆ సినిమాలో హీరోనే లేడు. కానీ 900కోట్లు వసూలు చేసింది. అది చిన్న సినిమానా? పెద్ద సినిమానా? ఇక్కడ హిట్ అవ్వడం ముఖ్యం.' అంటూ చెప్పుకొచ్చింది తమన్నా.

# ఆత్మ వర్సెస్ పరమాత్మ.. సింపుల్‌గా ఇదే ఓదెల-2

'ఏమైంది ఈ వేళ' ప్యూర్ యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్. రామ్‌చరణ్ 'రచ్చ' పక్కా మాస్ ఎంటర్‌టైనర్. కెరీర్ ప్రారంభంలోనే పొంతనలేని జానర్లతో సినిమాలు తీసి విజయాలు అందుకున్నారు దర్శకుడు సంపత్ నంది. ఆయన దర్శకత్వంలో వచ్చిన బెంగాల్ టైగర్, సిటీమార్ సినిమాలు కూడా మాస్‌ని మెప్పించాయి. సంపత్ నంది దర్శకత్వపర్యవేక్షణలో వచ్చిన ఓటీటీ హిట్ 'ఓదెల రైల్వే స్టేషన్' ఓ మర్డర్ మిస్టరీ. దానికి సీక్వెల్‌గా రాబోతున్న 'ఓదెల 2' సూపర్ నాచురల్ థ్రిల్లర్. ఇవి కూడా పొంతన లేని జానర్లే. 'ఓదెల2'కు కథ, కథనం, మాటలు, నిర్మాణం, దర్శకత్వపర్యవేక్షణ బాధ్యతల్ని సంపత్ నంది నిర్వహించారు. ఈ నెల 18న 'ఓదెల 2' విడుదల కానుంది. ఈ సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లో ఆయన విలేకరులతో ముచ్చటించారు.



అసలు 'ఓదెల రైల్వేస్టేషన్' చేసేటప్పుడు ఆ కథకు సీక్వెల్ చేయాలనే ఆలోచన లేదు. కథ డిమాండ్ చేయడంతో తెలీకుండానే సీక్వెల్‌కి లీడ్ ఇచ్చాను. ఆ సినిమా ఓటీటీలో మంచి హిట్. ఆ సినిమా చూసిన వారూ, దానికి పనిచేసిన వారూ.. ఇలా చాలా మంది సీక్వెల్ రాయొచ్చుగా అని అడిగే వాళ్లు. ఓసారి భీమ్స్‌తో కలిసి మ్యూజిక్ సిట్టింగ్స్‌కి వెళ్లాను. వెళ్లిన పని అవ్వలేదు కానీ.. ఈ సీక్వెల్ పాయింట్ మాత్రం అక్కడే పుట్టింది. ఫస్ట్‌పార్ట్‌లో ఒక దుష్టశక్తి అంతం అవుతుంది. దాని ఆత్మని కంట్రోల్ చేయడానికి మరో శక్తి కావాలి. ఆ శక్తి శివశక్తి అయితే ఎలా ఉంటుంది? అనే ఆలోచన వచ్చింది. అప్పుడు నా మనసులో మెదిలిన రూపం తమన్నా. ఆమెతో ఇప్పటికే రెండు సినిమాలు చేశాను. మంచి యాక్టర్ ఈ పాత్ర బాగా చేయగలదు అనిపించింది. కథ తనకు కూడా నచ్చింది. అలా 'ఓదెల2' పట్టాలెక్కింది.

- సింపుల్‌గా చెప్పాలంటే ఆత్మ వర్సెస్ పరమాత్మ.. అదే ఈ కథ. శివశక్తి లాంటి క్యారెక్టర్లను మాఊరి పరిసరాల్లో చూశా. మా నాన్నమ్మ కూడా శివశక్తిగా ఉండేవారు. ఊళ్లో ఎవరికైనా కష్టం వస్తే ఆమెకే చెప్పుకునేవారు. శివశక్తులే నాగసాధువులుగా మారి శివాలయాలను పునరుద్ధరణ చేస్తారనే విషయం కూడా తెలుసుకున్నా. ఆ ప్రేరణతోనే 'ఓదెల2' కథ రాశా. తమన్నా గెటప్‌కోసం ఎంతో శ్రమించాం. ఆమె కూడా చాలా కష్టపడి ఈ పాత్ర చేశారు.
- సూపర్‌స్టార్ల సినిమాల్లో ఉండే క్వాలిటీ గ్రాఫిక్స్ ఈ సినిమాలో ఉంటాయి. దాదాపు 150మంది వీఎఫ్ఎక్స్ నిపుణులు ఆరు నెలలుగా కష్టపడి సీజీ వర్క్ చేస్తున్నారు. అజనీష్ సంగీతం సినిమాకు హైలైట్. ముఖ్యంగా ఆయన ఆర్ఆర్‌తో సినిమాకు ప్రాణం పోశారు. దర్శకుడు అశోక్ అద్భుతంగా సినిమాను మలిచాడు. హెబ్బా పటేల్ పాత్ర కూడా చాలా బావుంటుంది. అన్ని వర్గాలకూ 'ఓదెల 2' నచ్చుతుంది.

# కుబేర పాటల సందడి షురూ



ఆడియన్స్ అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమాల్లో ధనుష్ 'కుబేరా' ఒకటి. అక్కినేని నాగార్జున ఇందులో ప్రత్యేక పాత్ర పోషిస్తున్నారు. రష్మిక కథానాయిక. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో రూపొందుతోన్న ఈ పానిండియా సినిమాను సునీల్ నారంగ్, పుస్కుర్ రామ్‌మోహన్‌రావు కలిసి నిర్మిస్తున్నారు. జూన్ 20న తమిళ, తెలుగు, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా మ్యూజికల్ ప్రమోషన్స్‌ని మేకర్స్ మొదలుపెట్టారు. శేఖర్ కమ్ముల సినిమాలన్నీ మ్యూజికల్ బ్లాక్‌బస్టర్సే. అలాగే ఈ సినిమాలోని పాటలు కూడా ఆకట్టుకుంటాయని మేకర్స్ చెబుతున్నారు. దేవిశ్రీప్రసాద్ స్వరపరిచిన ఈ సినిమాలోని తొలి పాటను ఈ నెల 20న విడుదల చేయనున్నారు. ఈ సందర్భంగా సాంగ్ ఎనౌన్స్‌మెంట్ పోస్టర్‌ని కూడా విడుదల చేశారు. విజిల్ వేస్తూ డాన్స్ చేస్తున్న ధనుష్‌ని ఈ పోస్టర్‌లో చూడొచ్చు.

# విజువల్ వండర్‌గా మదరాసి



తమిళ అగ్ర హీరో శివకార్తికేయన్ కథానాయకుడిగా రూపొందుతోన్న పాన్ ఇండియా చిత్రం 'మదరాసి'. ఎ.ఆర్.మురుగదాస్ దర్శకుడు. శ్రీలక్ష్మీ మూవీస్ నిర్మిస్తున్న ఈ చిత్రం సెప్టెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఉత్కంఠభరితమైన కథ, కథనాలతో ఉద్వేగపూరితమైన యాక్షన్ ఎంటర్టైనర్‌గా ఈ సినిమా ఉంటుందని, దర్శకుడు మురుగదాస్ విజువల్ వండర్‌గా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారని మేకర్స్ చెబుతున్నారు. రుక్మిణి వసంత్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో విద్యుత్ జామ్వాల్, బిజు మీనన్, షబీర్, విక్రాంత్ కీలక పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: సుదీప్ ఎలామోన్, సంగీతం: అనిరుధ్ రవిచందర్.

# తల్లి కోసం కొడుకు త్యాగమే ఈ సినిమా



'ఈ సినిమా కోసం ముందు అనుకుంది మామూలు మాస్ కథ. అయితే.. రాస్తున్న క్రమంలో ఓ పవర్‌ఫుల్ మదర్ కూడా ఉంటే బావుంటుందనిపించింది. ఆ మదర్ కూడా 'కర్తవ్యం'లో వైజయంతి లాంటి శక్తిమంతమైన పాత్ర అయితే ఇంకా బావుంటుందనిపించింది. ముందు కల్యాణ్‌రామ్‌కి కథ చెప్పాం. ఆయన చేద్దాం అన్నారు. కానీ విజయశాంతిగారు తల్లి పాత్రకు ఒప్పుకుంటేనే చేద్దాం అని క్లియర్‌గా చెప్పారు. విజయశాంతిగారు ఈ కథ విని హ్యాపీగా ఫీలయ్యారు. చిన్న కరెక్షన్స్ చెప్పారు. ఆ మార్పులు చేసిన తర్వాత సినిమా సెట్స్ మీదకెళ్లింది.' అని దర్శకుడు ప్రదీప్ చిలుకూరి చెప్పారు. ఆయన దర్శకత్వంలో కల్యాణ్‌రామ్ కథానాయకుడిగా రూపొందిన చిత్రం 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి'. విజయశాంతి కీలక పాత్ర పోషించారు. అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మాతలు. ఈ నెల 18న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా దర్శకుడు ప్రదీప్ చిలుకూరి ఆదివారం హైదరాబాద్‌లో విలేకరులతో ముచ్చటించారు. 'కథ రీత్యా ఇందులో హీరో పాత్ర, మదర్ పాత్ర రెండూ ఎవరి ఐడియాలజీలో వాళ్లు కరెక్ట్‌గా ఉంటారు. అక్కడ్నుంచే కాన్ఫ్లిక్ట్ క్రియేట్ అవుతుంది. రెండు పాత్రలూ పవర్‌ఫుల్‌గా ఉంటాయి. తల్లి కోసం కొడుకు చేసే త్యాగమే ఈ సినిమాకు హైలైట్. తెరపై భావోద్వేగానికి లోనుచేసే అంశమది. ఇందులోని పాత్రలన్నీ కథలో భాగమే. సాంకేతికంగా అభినందనీయంగా సినిమా ఉంటుంది. ఎన్టీఆర్ సినిమా చూసి సంతృప్తిగా ఫీలయ్యారు. కల్యాణ్‌రామ్ సినిమాపై ఎంతో నమ్మకంతో ఉన్నారు. తప్పకుండా అందరికీ ఈ సినిమా నచ్చుతుంది.' అని ప్రదీప్ చిలుకూరి తెలిపారు.

# బ్రదర్.. నా గురించి నువ్వేం బాధ పడకు




సోషల్ మీడియా వచ్చాక, పనిలేని వాళ్లందరికీ పని దొరికినట్టయ్యింది. అదికూడా పైసా ఉపయోగం లేని పని. తమకే కాదు, సమాజానికి కూడా ఏ మాత్రం ఉపయోగం లేని పోస్టులను పెడుతూ ఏరోజుకారోజు సంతృప్తిని పొందే బ్యాచ్ కొందరు తయారయ్యారు. అలాంటి ఓ బ్యాచ్‌కి చెందిన ఒకడు.. హీరోయిన్ నిధి అగర్వాల్ గురించి తన సోషల్ మీడియాలో ఓ పోస్ట్ పెట్టాడు. ఆమెను శ్రీలీలతో పోలుస్తూ.. '2019లో వచ్చిన 'ఇస్మార్ట్ శంకర్' తర్వాత ఈమె ఏం చేసింది? ఎన్ని సినిమాలు చేసింది? 2021లో వచ్చిన శ్రీలీల ఇప్పటికి 20 సినిమాలు చేసింది.' అని వ్యంగ్యంగా రాసుకొచ్చాడు. ఆ పోస్ట్ నిధి అగర్వాల్ కంటపడింది. దాంతో ఆమె తనదైన శైలిలో స్పందించింది. ' 'ఇస్మార్ట్ శంకర్' తర్వాత తెలుగు, తమిళం కలిపి మూడ్నాలుగు సినిమాలు చేశా. 'హరి హర వీర మల్లు', 'ది రాజాసాబ్' సినిమాలు సెట్స్‌పై ఉన్నాయి. మంచి స్క్రిప్ట్ అనుకుంటేనే సంతకం చేస్తున్నా. నాకు వరుసగా సినిమాలు చేయాలని లేదు. మంచి సినిమాల్లో భాగం కావడమే నాకు ముఖ్యం. ఇండస్ట్రీలో చాలాకాలం ఉండాలనుకుంటున్నా. కాబట్టి.. బ్రదర్ నా గురించి నువ్వేమీ బాధ పడకు..' అంటూ కౌంటర్ ఇచ్చింది నిధి అగర్వాల్.



# ఏదో ఏదో జరిగెనే ఎద లోపలా..

రాహుల్ విజయ్, నేహా పాండే జంటగా నటిస్తున్న లవ్ అండ్ కామెడీ ఎంటర్టైనర్ 'ఖేల్ ఖతమ్ దర్వాజా బంద్'. అశోక్‌రెడ్డి కడదూరి దర్శకుడు. అర్జున్ దాస్యన్ నిర్మాత. త్వరలో సినిమా విడుదల కానుంది. ప్రమోషన్‌లో భాగంగా ఈ సినిమాలోని పాటను మేకర్స్ విడుదల చేశారు. 'ఏదో ఏదో ఏదో జరిగెనే ఎద లోపలా.. ఏవో ఏవో కలలు విరిసెనే.. నిన్నా మొన్నా లేదే అరే ఏంటిలా..' అంటూ సాగే ఈ పాటను పూర్ణాచారి రాయగా, సురేష్ బొబ్బిలి స్వరపరిచారు. కార్తీక్ హరిణి ఆలపించారు. నాయకానాయికల ప్రేమబంధాన్ని ఆవిష్కరించేలా ఈ పాట రూపొందింది. అన్ని వర్గాల ప్రేక్షకులకూ నచ్చే సినిమా ఇదని మేకర్స్ చెబుతున్నారు. అజయ్‌ఘోష్, మురళీధర్‌గౌడ్, గెటప్ శ్రీను, రచ్చ రవి, గంగవ్వ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: కార్తీక్ కొప్పెర.

# మనసుల్ని కదిలించే పాత్రలో



శివాజీ ప్రధాన పాత్ర పోషిస్తున్న చిత్రం 'దండోరా'. మురళీకాంత్ దర్శకుడు. రవీంద్ర బెనర్జీ ముప్పానేని నిర్మాత. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతున్నది. ఇటీవలే రెండో షెడ్యూల్‌ను మొదలుపెట్టారు. 25 రోజుల పాటు జరిగే ఈ షెడ్యూల్‌లో ప్రధాన తారాగణం పాల్గొంటారు. ఇందులో నటి బిందుమాధవి వేశ్యగా కీలక పాత్ర పోషిస్తున్నారు. భావోద్వేగభరితంగా, ఆలోచింపజేసేలా ఆమె పాత్ర ఉంటుందని మేకర్స్ చెబుతున్నారు. శివాజీతోపాటు బిందుమాధవి కూడా ఈ షెడ్యూల్లో పాల్గొంటారని మేకర్స్ తెలిపారు. తెలంగాణ గ్రామీణ నేపథ్యంలో స్థానిక సంస్కృతి, సంప్రదాయాలను ఆవిష్కరిస్తూ, గ్రామల్లో భూస్వాముల దౌర్జన్యాలపై సామాన్యుల తిరుగుబాటును చూపించే చిత్రమిదని, చక్కటి హాస్యం.. వ్యంగ్యంతో పాటు హృదయాన్ని కదిలించే ఉద్వేగాలుంటాయని మేకర్స్ తెలిపారు. నవదీప్, నందు, రవికృష్ణ, మణిక తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: మార్క్ ఆర్ రాబిన్, దర్శకుడు: మురళీకాంత్.